క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి 'మన ఊరు-మన వీధి'


జమ్మినగర్ వాసులతో మాట్లాడుతున్న అధికారులు

వెలుగోడు: గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు మన ఊరు- మన వీధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జమ్మినగర్‌లో మన ఊరు- మన వీధి కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు వీధుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వాకి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, వివిధ పథకాలకు సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత తప్పనిసరి


విద్యార్థుల ట్యాబ్‌లు పరిశీలిస్తున్న ఏఎంఓ లలిత కుమారి

వెలుగోడు: మన బడి నాడు-నేడు కింద చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఏఎంఓ లలిత కుమారి ఆదేశించారు. మండలంలోని జెడ్పీ పాఠశాల, స్పెషల్ స్కూల్, భవితా కేంద్రం, ఎంఆర్‌సీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే రెండో దశ నాడు-నేడు పనులను పరిశీలించారు. 8వతరగతి విద్యార్థులతో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంఓ యూసుఫ్ బాషా, ఎంఈఓ బ్రహ్మంనాయక్, హెచ్‌ఎం రూతు, సీఆర్‌పీలు వకీల్, నాగన్న, అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


గాంధీనగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చొరవతో పట్టణంలో మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెలుగోడు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో గాంధీనగర్ వాసులు విద్యుత్ స్తంభాల సమస్యను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో శుక్రవారం ఏఈ రవీంద్రనాయక్ మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, వైఎస్‌ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, యూత్ నాయకులు షంషీర్, ఆరిఫ్, జాకీర్, మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు

పట్టించుకోకపోతే ప్రమాదమే


రోడ్డు పక్కన గుంత

పగిడ్యాల:ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ. 3.79 కోట్ల వ్యయంతో కొణిదేల నుంచి పగిడ్యాల వరకు బీటీ రోడ్డు వేశారు. నిర్మాణ సమయంలో నల్లవాగు వద్ద కల్వర్టుకు ఉన్న సైడ్‌బర్మ్‌ను తొలగించారు. తర్వాత వాటిని పూడ్చకపోవడంతో ఆ గుంతలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి వాటిని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

మహానంది: విద్యార్థులు చదువులో రాణించాలని ఎస్‌ఎస్‌ఏ పథకం ఏఎస్‌ఓ మనోహర్ రెడ్డి తెలిపారు. తిమ్మాపురం జెడ్పీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏఈఓ రామసుబ్బయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుబ్బరాయుడు, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.

కనుల పండువగా..

- గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో మరకతలింగేశ్వరుడి ధ్వజప్రతిష్ఠ
- పూజల్లో పాల్గొన్న నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి దంపతులు
- వేలాది సంఖ్యలో హాజరైన భక్తులు


ఎమ్మెల్యే శిల్పా రవి దంపతులను సన్మానించిన మస్తాన్‌రావు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలసిన శ్రీ గంగా, గౌరీ సమేత మరకతలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కల్యాణోత్సవం పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో రుత్వికులు, పండితులు ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవించంద్రకిషోర్‌రెడ్డి, ఆయన సతీమణి, కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి, మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ప్రముఖ వాస్తు, జ్యోతిష్య నిపుణులు గడ్డిపాటి వీరవెంకటవరప్రసాద్, శ్రీనగరం హరిశ్చంద్రప్రసాద్, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, యంత్ర స్థాపన, ధ్వజ ప్రతిష్ఠ, మహా కుంభోత్సవం, మహా కుంభాభిషేకం, మహా కుంభబలి, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామంలో భక్తజనం మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. మరకతలింగేశ్వర, నవగ్రహ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నంద్యాల ఎమ్మెల్యే తెలిపారు. పూజల అనంతరం ఆలయ వ్యవస్థాపకులు ఆయనకు స్వామివారి మెమొంటో అందించి వేదాశీర్వచనం చేశారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు

శ్రీశైల భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేదపండితులు,అర్చకులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఆశీనులు చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల, సహస్రనామపూజలు శాస్త్రోక్తంగా చేశారు.

గ్రామదేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం అధికారులు ప్రత్యేక అభిషేక, కుంకుమార్చనలు నిర్వహించారు. అంకాలమ్మ అభిషేకానికి ముందుగా లోక కల్యాణం కోసం అర్చకులు శాంతి సంకల్పాన్ని పఠించి మహాగణపతి పూజ చేశారు. ఆ తరువాత అంకాలమ్మ తల్లికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం పూజలు చేశారు. అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

పల్లకీలో మహానందీశ్వరుడు

మహానంది: శ్రీగంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు వేదపండితులు, అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి అలంకారమండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, తదితరులు పాల్గొన్నారు.


శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న ఈవో లవన్న, అర్చకులు

మహా శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మహానంది: మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, మహానంది ఉత్సవాల ప్రత్యేకాధికారి రాణాప్రతాప్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం ఆయన మహానంది వచ్చారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలతో ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. పార్కింగ్ ప్రదేశాలు, ఆలయ పరిసరాల్లో పర్యటించి శివరాత్రిలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని కోరారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి గురువారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు నందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేశారు. అనంతరం విశేష అన్నాభిషేకాలు నిర్వహించి నానపెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పగిడ్యాల: నవరత్నాలు –పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 210 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. పలు గృహాలు నిర్మాణ స్టేజీల్లో ఉన్నాయన్నారు. మరికొన్నింటి నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. సమన్వయంతో పనిచేసి ఆయా గృహాల నిర్మాణాలను ఉగాదిలోగా పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఇందుకు గ్రామ స్థాయిలో ఇంజనీరింగ్, హౌసింగ్, పంచాయతీ, వెల్ఫేర్, మహిళా పోలీస్, వీఆర్వో, గ్రామ వలంటీర్లు టీమ్‌గా ఏర్పడి పనిచేయాలని కోరారు. గృహ నిర్మాణాల టార్గెట్‌లు పూర్తి చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి


ఆర్‌ఓ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

జూపాడుబంగ్లా: మున్సిపల్ కార్యాలయాల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కరరెడ్డి కోరారు. ఈ అంశంపై శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిషన్స్, పార్కుమెయింటెనెన్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు హెల్త్ అలవెన్స్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అలాగే ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ అమలు రద్దు చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌ఓ విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పక్కీర్‌సాహెబ్, చాంద్‌బాషా, సర్వర్‌ఖాన్, బసీత్, ప్రతాప్, హరికృష్ణ, మల్లమ్మ, ఎల్లమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మరింత సాయం చేయాలి

జూపాడుబంగ్లా:పేదల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం మరింత సాయం చేయాలని సీపీఐ నాయకుడు రఘురామ్మూర్తి కోరారు. జీపుజాతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన జూపాడుబంగ్లాలో మాట్లాడుతూ ఇనుము, ఇసుక, సిమెంటు ధరలు పెరగటంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

5న ఒలంపిక్ సంఘం ఎన్నికలు



కర్నూలు (టౌన్): ఈ నెల 5వ తేదీన నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ సమీపంలో ఉన్న కేఈ ప్లాజా కాంప్లెక్స్‌లో ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం చైర్మన్ కేఈ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు జిల్లాలోని 24 క్రీడాంశాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఒలంపిక్ అసోసియేషన్‌చే గుర్తింపు పొందిన స్విమ్మింగ్, బాక్సింగ్, జూడో, తైక్వాండో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, ఫెన్సింగ్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, రైఫిల్ షూటింగ్, ట్రయాథ్లాన్, మోడరన్ పెంటాథ్లాన్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, స్క్వాష్ రాకెట్, రగ్బీ, ఉషూ, యాచింగ్ వంటి క్రీడాంశాలు ఉన్నాయని తెలిపారు. గుర్తింపు పొందిన ఈ క్రీడలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే జిల్లాలో మిగిలిన క్రీడాంశాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు కూడా సమావేశంలో పాల్గొని మద్దతు తెలియజేయాలని కోరారు. ఎన్నికైన సంఘం కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు నాలుగేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఒలంపిక్ సంఘం తరఫున పరిశీలకులుగా వైఎస్సార్ జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు సమరనాథ్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

నేడు సంఘం సర్వసభ్య సమావేశం

ఈ నెల 4వ తేదీ జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని, క్రీడా సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని జిల్లా సంఘం కార్యదర్శి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. నూతన కార్యవర్గ ఎన్నికకు ఒలంపిక్ క్రీడాంశాల్లో పాల్గొనే అసోసియేషన్లకే ఓటింగ్ ఉంటుందని రాష్ట్ర ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.పి.రావు స్పష్టం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్చరీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, జూడో, రోయింగ్, జిమ్నాస్టిక్స్, రగ్బీ, స్కేటింగ్, సైక్లింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, ఫెన్సింగ్, కరాటే వంటి క్రీడాంశాలకు కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఓటింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. ఈ ఒలంపిక్ సంఘం ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సంఘం ప్రతినిధి మహేశ్వరరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి వాసు

ఆళ్లగడ్డ: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి వాసు తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులు, న్యాయవాదులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాల వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని, ఇరువర్గాలకు అర్థమయ్యేలా న్యాయవాదులు, పోలీస్ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, జూనియర్ సివిల్ జడ్జి శైలజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సోమశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, గంగనాథ్‌బాబు, ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతులతో మమేకం కండి


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: రైతులతో రైతుభరోసా కేంద్రాల సిబ్బంది మమేకమై వ్యవసాయ సంబంధ అంశాల్లో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని నందికొట్కూరు వ్యవసాయశాఖ ఏడీ విజయశేఖర్, జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని తంగడంచ రైతుభరోసా కేంద్రంలో రైతుసలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కేంద్రాల్లో అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానంతో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు లభిస్తాయన్నారు. రైతులు ఆర్బీకేలను ఆశ్రయించి వాటిని పొందవచ్చునన్నారు. రబీసీజన్ ముగిసిన వెంటనే పంటల అవశేషాలను పొలంలోనే దున్నుకోవాలన్నారు. వేసవికాలంలో భూసారపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు అవసరమైన టార్పాలిన్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పరికరాలు, సూక్ష్మపోషకాలను రాయితీపై అందజేయాలని కమిటీ కోరింది. దీనిపై నివేదికను జిల్లా అధికారులకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన దూదేకుల బాష కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం అందజేశారు. ఎంపీడీఓ జీఎన్‌ఎస్ రెడ్డి ఆదేశాల మేరకు మృతుడి భార్య శరీఫాబీకి గ్రామసర్పంచ్ మదార్‌సాహెబ్ రూ. 10 వేలు అందజేశారు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీదారుడు అని పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు తెలిపారు.

నేడు మండల మీట్

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పంట నమోదు తప్పనిసరి

బండిఆత్మకూరు: రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి స్వాతి తెలిపారు. ఈ క్రాప్ చేసుకోవడం వల్ల రైతులకు పంటనష్ట పరిహారంతో పాటు పంట బీమా కూడా వర్తిస్తుందన్నారు. అంతేకాక ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. మండలంలో పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేయించుకోని రైతులు 2066 మంది ఉన్నారని ఏవో తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు గ్రామంలోని ముంతల ఆంజనేయులు ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో వస్తువులతో పాటు నగదు, బంగారు ఆభరణాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.5 లక్షల నష్టం జరిగిందని బాధితుడు ఆంజనేయులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు హరిత ఘటనాస్థలానికి చేరుకుని నష్టపరిహారాన్ని అంచనా వేశారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

జూపాడుబంగ్లా: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని నందికొట్కూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో తమ డిపోకు చెందిన డ్రైవర్ విజయుడు 30ఏళ్ల నుంచి ఒక్క ప్రమాదం చేయకుండా బస్సు నడిపారన్నారు. దీంతో ఆయన ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక చేసి సన్మానించినట్లు తెలిపారు. ప్రతి డ్రైవరు కూడా రోడ్డుభద్రతా నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు.

6న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల విభాగంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ నుంచి 13వ తేదీ వరకు విజయవాడలోని హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించనున్న 41వ సీనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9989982655 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చెంతకే వచ్చిన పింఛన్ కానుక


కర్నూలు పెద్దాసుపత్రిలో రవీంద్రుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాదం వెంకటేశ్వర్లు

వెలుగోడు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ పింఛన్‌దారులకు ఎంతో తోడుగా నిలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు సైతం వలంటీర్లు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేస్తున్నారు. వెలుగోడు పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలోని సాన రవీంద్రుడు, 4వ సచివాలయం పరిధిలోని అన్నెపోగుల చెంచమ్మ కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్లు ఆరీఫ్ జహన్, వాదం వెంకటేశ్వర్లు వేర్వేరుగా కర్నూలుకు వెళ్లి పెన్షన్ అందజేసి తమ సేవా దక్పథాన్ని చాటుకున్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల(అర్బన్): పట్టణంలో ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల అమ్మకాలకు సంబంధించి సరైన రికార్డులు చూపించని న్యూ శ్రీరామకృష్ణ ఏజెన్సీస్, న్యూ శ్రీ వసువాహిని ఏజెన్సీలకు సంబంధించి రూ.2.10 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలను స్టాప్ సేల్ ఇచ్చారు. సరైన వివరాలు సమర్పించిన తరువాత, ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్‌ఆర్‌ఓ ఖాన్, అగ్రికల్చర్ ఆఫీసర్ రూపస్, అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, నంద్యాల ఏఓ స్వప్నికారెడ్డి బృందం రికార్డులను పరిశీలించి సరైన పత్రాలు లేకపోవడంతో రెండు దుకాణాల్లో ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపి వేశారు. ఎఫ్‌ఆర్‌ఓ ఎంఏ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం యజమాని ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీకే ఎరువులను విక్రయించాలని సూచించారు.

34 ఏళ్ల క్రితం కర్నూలుకు కళా తపస్వి

- సన్మానం అందుకున్న కే విశ్వనాథ్


విశ్వనాథ్‌కు జ్ఞాపిక ప్రదానం చేస్తున్న జె.లక్ష్మీనారాయణరెడ్డి(ఫైల్)


విశ్వనాథ్‌కు జ్ఞాపికను అందిస్తున్న క్లాసికల్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షులు రవీంద్రనాథన్(ఫైల్)

కర్నూలు కల్చరల్: కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు కర్నూలుతో ప్రత్యేక అనుబంధం ఉంది. కర్నూలు క్లాసికల్ ఫిల్మ్ సొసైటీ శాస్త్రీయ చిత్రాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 34 ఏళ్ల క్రితం తనవంతు కృషి చేసింది. సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని అప్పటి ఆనంద్, నట్రాజ్, సాయిబాబా, చాంద్, నౌరంగ్, అలంకార్, నేతాజి థియేటర్లలో శంకరాభరణం, స్వర్ణకమలం, శృతిలయాలు, సప్తపది, స్వాతిముత్యం, సాగర సంగమం సినిమాలను ఆరు రోజులు పాటు ఉచితంగా ప్రదర్శించారు. ఏడో రోజు అన్ని థియేటర్లలో శంకరాభరణం సినిమాను ప్రదర్శించారు. అదే రోజు 1989లో మార్చి 24న కె.విశ్వనాథ్ దంపతులతో పాటు అప్పుడు షూటింగ్ జరుపుకుంటున్న సూత్ర దారులు చిత్ర యూనిట్‌ను కర్నూలుకు ఆహ్వానించి నేతాజి థియేటర్‌లో ఘనంగా సన్మానించారు. హీరో హీరోయిన్లు భానుచందర్, రమ్యకృష్ణ, మురళీ మోహన్, సిరివెన్నల సీతారామ శాస్త్రి తదితరులు హాజరయ్యారు. అప్పటి మంత్రి రాంభూపాల్ చౌదరి, పారిశ్రామిక వేత్త టీజీ వెంకటేష్, అప్పటి కలెక్టర్ సాహూ, సొసైటీ గౌరవాధ్యక్షులు రవీంద్రనాథన్‌లు ఘనంగా సన్మానించారు. కె.విశ్వనాథ్ కర్నూలు రావడం అదే మొదటిసారి, చివరి సారి. ఆయన మృతికి లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు కళాకారులు పత్తి ఓబులయ్య, మీనాక్షిరెడ్డి, మహమ్మద్ మియ్యా, గుర్రపుసాల అంకయ్య, రమణారెడ్డి, లక్ష్మన్న, క్రిష్టఫర్‌లు సంతాపం ప్రకటించారు.